క్లుప్తంగా

నేటి నుంచి ఒంటిపూట బడులు

ఆదోని సెంట్రల్: నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం నుంచి ఒంటిపూట తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈఓ–2 శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలని చెప్పారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరిగే పాఠశాలల్లో మాత్రం మధ్యాహ్నం 1.15 నుంచి 5.00 గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. ఆదోని నియోజకవర్గంలో 19 పరీక్ష కేంద్రాలు ఉండగా వాటిలో మాత్రం మధ్యాహ్నం నుంచి పాఠశాలలు జరుగుతాయని వెల్లడించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు



బహుమతులను అందుకున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ పఠనం, ఉత్తమ లేఖనంలో ప్రతిభ చాటారని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద్ తెలిపారు. శుక్రవారం 370 మంది విద్యార్థులు తెలుగు భాష పఠనం, లేఖనంపై పరీక్షలు రాయగా అందులో 20 మంది ప్రతిభను కనపరచారన్నారు. విద్యార్థులను అభినందిస్తూ కథల పుస్తకాలను బహుమానంగా అందజేశారు.

పరీక్షల పర్యవేక్షణ నుంచి మినహాయించాలి



ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: దీర్ఘకాలిక వ్యాధులు కలవారిని, గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులు, పదవీ విరమణకు దగ్గరలో ఉన్న ఉపాధ్యాయులను పదవ తరగతి పబ్లిక్ పరీక్షల పర్యవేక్షణ (ఇన్విజిలేషన్) విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ అకడమిక్ కమిటీ సభ్యులు మహాదేవప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న కోరారు. శుక్రవారం ఈ మేరకు ఎంఆర్‌సీ భవనంలో ఎంఈఓ–2 శ్రీనివాసులను కలసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం, దీనికి తోడు పని ఒత్తిడితో ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. రామకృష్ణ, సుధాకర్ బాబు, సూర్యుడు, అబ్దుల్ నబీ పాల్గొన్నారు.

డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించాలి

కోసిగి: మండలంలోని డి.బెళగల్ గ్రామ సచివాలయం సమీపంలో సాల్‌గిరిలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల నాయకులు రాముడు, వీరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామంలో సీపీఎం ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో సమాశమై సమస్యలపై చర్చించారు. కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్డు లేక పోవడంతో వర్షాకాలంలో గ్రామంలోని వర్షపు నీరు అంతా దిగువకు చేరుకుని తీవ్ర ఇబ్బందికరంగా మారుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని వాపోయారు. హనుమంతు, నాగేంద్ర, వీరేష్, తాయన్న పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కుళాయి గుంతలు



గాంధీనగర్‌లో కుళాయి గుంతలు తవ్విన దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని గాంధీనగర్‌లో కుళాయి గుంతలు ప్రమాదకరంగా మారాయి. మునిసిపల్ అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కాలనీలో కుళాయి గుంతలు తవ్వుతున్నారని, వాటిలో పిల్లలు పడే ప్రమాదం ఉందని హైకోర్టు న్యాయవాది కాకర్ల చంద్రశేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుంతల తవ్వకంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఆదోని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా హోలీ వేడుకలు

ఆదోని అర్బన్: పట్టణంలో శుక్రవారం హోలీ వేడుకలను పట్టణ ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులను చల్లుకుని సంబరాలు చేసుకున్నారు. సంతపేట, ఆర్టీసీ కాలనీ తదితర కాలనీల్లో హోలీ వేడుకలు మిన్నంటాయి.

ఆదోని సెంట్రల్: పట్టణంలో హోలీ సంబరాలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండే చిన్న పిల్లలు, యువకులు, పెద్దలు ఒకరిపై ఒకరు రంగులను చల్లుకొని పురవీధుల్లో కలయ తిరిగారు. ముఖ్యంగా పెద్దమార్కెట్లో సంబరాలు మిన్నంటాయి. హిందూ పురాణాల ప్రకారం భక్త ప్రహ్లాదున్ని చంపడానికి ప్రయత్నం చేసిన హిరణ్యాకశ్యపుని చెల్లెలైన హోలిక అనే రాక్షసి దహనానికి సంకేతంగా సంప్రదాయ భోగి మంటలను, విజయదశమి రోజున రావణుని ప్రతిమను దహనం చేసినట్లుగా వివిధ ప్రాంతాల్లో రాక్షసుల పరాక్రమం హోలిక దహనంతో అంతమైనందున సంబరాలు జరపుకుంటారని స్థానిక పెద్దలు పేర్కొన్నారు.



మొక్కు నెరవేరడంతో యువతి వేషంలో యువకుడు

ఘనంగా రతీ మన్మథుల రథోత్సవం

ఆదోని రూరల్: మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలో రతీ మన్మథుల మహా రథోత్సవం శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివార్లకు కుంభాలు, కలశాలతో ప్రదర్శనగా వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు వీరు వారవుతారు..

కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దు ప్రాంతంలో ఉన్న సంతెకూడ్లూరు గ్రామంలో పురాతన కాలం నుంచి వింత ఆచారం నడుస్తోంది. మొక్కులు తీరిన పురుషులు స్త్రీ వేషధారణలో రతీ మన్మథులకు మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. శనివారం ఉదయం రతీ మన్మథులను దహనం చేసి అనంతరం ప్రతి ఇంటి నుంచి కుంభాలు, కలశాలు, వేషధారణలతో ప్రదర్శనగా వచ్చి మొక్కులు తీర్చుకోనున్నారు.

ఎమ్మిగనూరుటౌన్/రూరల్: హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం నియోజకవర్గంలో ఈవేడుకలు ఉత్సాహంగా సాగాయి. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. ఎమ్మిగనూరు పట్టణంతో పాటు మండలపరిధిలోని గుడేకల్ గ్రామంలో ఈ వేడుకలు పెద్ద స్థాయిలో జరిగాయి.



ఆలయానికి ఆడవారి వేషంలో వెళ్తున్న ఓ భక్తుడు



రథాన్ని లాగుతున్న భక్తులు

పది పరీక్షలకు సన్నద్ధం

- ఎమ్మిగనూరులో 14 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ
- 220 మంది ఇన్విజిలేటర్ల నియామకం

ఎమ్మిగనూరుటౌన్: మరో మూడురోజుల్లో పదవ తరగతి పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో ఓ వైపు విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతుంటే మరోవైపు అధికారులు పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఎమ్మిగనూరు పట్టణంతో పాటు మండలంలోని బనవాసి గురుకుల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మండల పరిధిలో 2600 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారు. వీరికి పట్టణంతో పాటు మండలంలో 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు 220 మంది ఇన్విజిలేటర్లను జిల్లా విద్యాశాఖ అధికారులు నియమించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు ఎంఎస్ జెడ్పీ బాలికల హైస్కూల్‌లో రెండు కేంద్రాలు, వీవర్స్ కాలనీ హైస్కూల్, సోగనూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్, ఉర్దూ హైస్కూల్, ఎస్ఎంఎస్ హైస్కూల్, బనవాసి గురుకుల పాఠశాలల్లో రెండు పరీక్ష కేంద్రాలతో పాటు పట్టణంలోని నారాయణ, శ్రీచైతన్య, భాష్యం, లిటిల్‌ఫ్లవర్ స్కూల్, మాచాని సోమప్ప ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లలో ఒక్కో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ డీఈఓ వెంకటరమణారెడ్డి తెలిపారు.



ఎమ్మిగనూరు బాలికల హైస్కూల్‌లో పరీక్షలకు ప్రిపేరవుతున్న విద్యార్థులు

కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు:

పట్టణంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్థానిక ఎంఈఓలు ఆంజినేయులు, మధుసుదన్‌రాజు తెలిపారు. కేంద్రాల సమీపంలో ఉండే జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు హాల్‌టికెట్లతో అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. అలాగే ప్రతి కేంద్రంలో మంచినీరు, విద్యుత్, ప్రథమ చికిత్స సదుపాయం కల్పనకు చర్యలు తీసుకున్నామన్నారు.

వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి

ఎమ్మిగనూరుటౌన్: గ్రామ, వార్డు వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సురేష్, కార్యదర్శి నవీన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సిఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్లకు వేతనం రూ.5 వేల నుంచి రూ.10వేలకు పెంచుతామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. వలంటీర్లను విధుల్లోకి తీసుకొని వారికి ఇవ్వాల్సిన పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని కోరారు. బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో వలంటీర్లను విధుల్లో తీసుకునేలా ప్రభుత్వం ప్రకటన చేయాలని సూచించారు. వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్న తదితర డిమాండ్లతో ఈనెల 17వ తేదీన విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి వార్డు, గ్రామ వలంటీర్లు తరలిరావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రాముడు, ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల సంఘ నాయకులు రవికుమార్, లోక్‌నాథ్, రమేష్, గపూర్, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వలంటీర్ యూనియన్ కార్యదర్శి

మార్కండేయ స్వామికి మండల పూజలు





స్వామి వారికి హారతినిస్తున్న అర్చకులు, హోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు గరుఢాద్రి వెంకటసుబ్బయ్య శాస్త్రి

కోసిగి: మండల కేంద్రంలోని పద్మశాలి కులబాంధవుల ఆరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో స్వామి వారికి మండల పూజలు ఘనంగా చేపట్టారు. ఆలయంలో ఆదోనికి చెందిన వేదపండితులు గరుడాద్రి వెంకట సుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వీరేష్ స్వామి, ఆలయ ధర్మకర్త యంగల ఆంజనేయులు నేతృత్వంలో ఆలయ గోపుర, ముఖద్వార గోపుర కలశ స్థాపన చేసి 41 రోజులు పూర్తయిన సందర్భంగా మండలి పూజలు చేపట్టారు. వేకువజాము నుంచి జలాభిషేకం, రుద్రాభిషేకం, వెండి కవచ అలంకరణ, ఫలపుష్పాలతో విశేషంగా అలంకరించి మహా మంగళహారతులిచ్చారు. భక్తులతో హోమాలు జరిపించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆలయ గోపుర నిర్మాణానికి విరాళాలిచ్చిన కులస్తులను సన్మానించారు.



అన్నదానం చేస్తున్న దృశ్యం

ఎరిగేరిలో దాహం...దాహం



నీళ్ల కోసం కుళాయిల వద్ద గుమిగూడిన జనం

కౌతాళం: వేసవి ప్రారంభంలోనే గ్రామాల్లో మంచి నీటి కష్టాలు తీవ్రమవుతున్నాయి. మండలంలోని ఎరిగేరి గ్రామంలో ప్రజలకు నీటి కష్టాలు వేధిస్తున్నాయి. గ్రామంలోని జంగాల కాలనీకి తాగునీరు వారానికొకసారి వస్తుండడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి కోసం నిత్యం గొడవలు జరుగుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీ ఆదోని రోడ్డులో గ్రామం చివరిన ఉందని దీంతో నీటి కష్టాలు అధికంగా ఉన్నాయంటున్నారు. సమస్యను పలుమార్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు, గ్రామ నాయకులకు తెలిపినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.

అధికారులు స్పందించాలి



అధికారులు స్పందించి తాగునీరు సక్రమంగా వచ్చేటట్లు చూడాలి. తాగునీటి కోసం రోజూ కుళాయిల వద్ద గొడవలు, ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. సక్రమంగా నీరొస్తే వాటికి అవకాశముండదు. అధికారులు చర్యలు తీసుకోవాలి.
– బుసమ్మ

తాగునీటి కష్టాలు లేకుండా చూడాలి



అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి. తమ కాలనీకి కనీసం వారానికి రెండు సార్లు నీటిని సరఫరా చేస్తే నీటి కష్టాలు తప్పుతాయి. ఇప్పుడు వారానికి ఒకసారి కూడా సక్రమంగా రావడం లేదు. నీళ్లు ఎప్పుడొస్తాయోనని ఎదురు చూడాల్సిన పరిస్థితి. నీటి కోసం ప్రతి ఇంట్లో ఒకరు పనులు మానుకోవాల్సి వస్తోంది. నీటి కష్టాలు తీర్చేందుకు చర్యలు చేపట్టాలి.
– సుబ్బరాజు

కారు – ట్రాక్టర్ ఢీ.. నలుగురికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: కోటేకల్ గ్రామ కొండల మలుపు దగ్గర గురువారం అర్ధరాత్రి కారు–ట్రాక్టర్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురికి గాయలయ్యాయి. వివరాలు..ఆదోని నుంచి ఎమ్మిగనూరు వైపు వస్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి కారు ఢీ కొంది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ వీరేష్, కారులో ఉన్న శ్రీనివాసులు, నిజాముద్దీన్, సుభ్రత్‌నాయక్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే అంబులెన్స్‌లో ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నలుగురిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ వీరేష్‌ది నాగలాపురం కాగా కారులో ఉన్న వారు ఆదోని పట్టణవాసులు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు రూరల్ పోలీసులు శుక్రవారం తెలిపారు.

చేతిరాతను మెరుగుపరుచుకోవాలి

గోనెగండ్ల: ప్రతి విద్యార్థి చేతిరాతను మెరుగుపరుచుకోవాలని, తద్వారా పరీక్షల్లో మంచి మార్కులు వస్తాయని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ షాహినా పర్వీన్ సూచించారు. శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఉచిత హ్యాండ్ రైటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లుసిడా హ్యాండ్ రైటింగ్ ట్రైనర్ ఎస్. రాజశేఖర్, పాఠశాల ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ మాట్లాడుతూ చదివింది ఒక ఎత్తయితే పరీక్షలో సక్రమంగా రాయడం మరో ఎత్తు అన్నారు. గుండ్రంగా రాస్తే మూల్యాంకనంలో ప్రాధాన్యం ఉంటుందన్నారు. చక్కగా రాసిన వారికి మంచి మార్కులు వస్తాయని తెలిపారు. చేతిరాత పరీక్షలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారిని అభినందించారు. అనంతరం ట్రైనర్ రాజశేఖర్‌ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏపీ మోడల్ స్కూల్‌లో చేతిరాత సాధన చేస్తున్న విద్యార్థినులు

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక



విద్యార్థులతో పీఈటీ దుబ్బన్న

పెద్దకడబూరు: మండలంలోని కల్లుకుంట గ్రామ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారని పీఈటీ దుబ్బన్న తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎం.బాబు, చాంద్‌బాషా, వి.గంగాధర్, ఎండీ శరత్, వీ.సతీష్ ఎన్నికయ్యారని, ఈ నెల 15, 16 తేదీల్లో విజయవాడలోని ఐజీఎంసీ స్టేడియంలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

ప్యాడ్స్, పెన్నుల పంపిణీ

కోసిగి: ఈనెల 17వ తేదీ నుంచి జరుగబోయే 10వ తరగతి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించాలని సీపీఐ మండల కార్యదర్శి గోపాల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లోని పదో తరగతి విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వార్డెన్ కోటేశ్వర రావు సమక్షంలో పరీక్షల ప్యాడ్, పెన్నులు అందజేశారు.

నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

ఆదోని అర్బన్: స్థానిక దుల్హా పైల్వాన్ స్కూల్‌లో ఆలిండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు చాంద్‌బాషా, వైస్ ప్రెసిడెంట్ హలీం సిద్దికీ, రాష్ట్ర కోశాధికారి నజీర్‌అహ్మద్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. అధ్యక్షుడిగా సాదిక్, ఉపాధ్యక్షుడిగా ముజాహిద్, కార్యదర్శిగా జహంగీర్, కోశాధికారిగా జమాల్, జాయింట్ సెక్రటరీగా గౌస్‌ను ఎన్నుకున్నారు.

రేపు దొడ్జెబాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ఆదోని సెంట్రల్: ఈ నెల 16వ తేదీ దొడ్జెబాల్ క్రీడా పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తామని ఆంధ్రప్రదేశ్ దొడ్జెబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కమ్మిరెడ్డి, కార్యదర్శి సాబీర్ అహ్మద్ శుక్రవారం తెలిపారు. వయస్సుతో నిమిత్తం లేకుండా క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఏప్రిల్ 25 నుంచి 27వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రం ఉడిపిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆదోనిలోని విజయలక్ష్మి నర్సింగ్ హోం సమీపంలోనున్న హై స్కూల్ మైదానంలో ఎంపిక ఉంటుందని వివరించారు.

భర్త వేధింపులు తాళలేకనే..

ఆదోని అర్బన్: భర్త అనుమానం, వేధింపులతోనే తమ కుమార్తె వాణి గురువారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి మునిస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ తెలిపారు. గురువారం ఉదయం వాల్మీకినగర్‌కు చెందిన వాణి అనే వివాహిత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. అయితే కొన ఊపిరితో ఉన్న వాణిని బంధువులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు రెఫర్ చేశారు. కర్నూలులో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త రాఘవేంద్ర మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడని, వారికొక కుమార్తె సంతానం. ఎవరితో మాట్లాడినా పుట్టింటికి వెళ్లినా వాణిపై భర్త అనుమానం పెంచుకున్నాడని, రోజూ అనుమానంతో వేధింపులకు గురిచేస్తున్నాడని మృతురాలి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారని సీఐ వివరించారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ఈ విద్యాసంవత్సరం నుంచే ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య(ఎంఈఎఫ్) తాలూకా గౌరవాధ్యక్షుడు మాదన్న, ప్రసన్నకుమార్, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ తిమ్మరాజు, నాయకులు బజారప్ప, రాజశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని హైస్కూల్ ఆవరణలో సమాఖ్య అధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాటంతోనే వర్గీకరణ సాధ్యమైందన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు మేరకు రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణపై ఏకసభ్య కమిషన్‌ను నియమించడం జరిగిందన్నారు. ఇటీవల కమిషన్ నివేదిక సమర్పించడంతో ఈ విద్యాసంవత్సరం నుంచే వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలన్నారు. కురువ, కురుబ కులస్తులకు ఎస్సీ హోదా కోరడం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డికి తగదన్నారు. సమావేశంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు జయానంద్, ముగతి ప్రతాప్, ఆనంద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



హైస్కూల్ ఆవరణలో అభివాదం చేస్తున్న మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు

మైనార్టీ కాలనీ సమస్యలు పరిష్కరించండి

ఆదోని రూరల్: పట్టణశివారు ప్రాంతమైన మైనార్టీ కాలనీలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కమిటీ సభ్యులు వీరేష్, ఖాన్, నాయకులు ఎక్బాల్ అన్నారు. శుక్రవారం స్థానిక సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మైనార్టీ కాలనీలో పర్యటించారు. వారు మాట్లాడుతూ మైనార్టీ కాలనీ ఏర్పడి సుమారు 20 సంవత్సరాలు అవుతున్నప్పటికీ కాలనీకి వెళ్లడానికి రోడ్డు లేని పరిస్థితి. కాలనీలో సుమారు 200 కుటుంబాల వరకు నివాసముంటున్నారన్నారు. చెత్తా, చెదారం, ముళ్ల చెట్లు, పొదలు, విష పురుగులతో స్థానికులు సతమతమవుతున్నారన్నారు. గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాలంటే సుమారు రెండు కి.మీ.మేర నడవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కాలనీకి సరఫరా అవుతున్న మంచినీటి పైపులైన్ నిత్యం లీకేజీలతో నీరు వృథా అవుతున్నాయని చెప్పారు. కాలనీలో ఉన్న స్కూల్‌కు పక్కా భవనం నిర్మించాలని కోరారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.



మైనార్టీ కాలనీలో మొలిచిన ముళ్ల కంపను చూపుతున్న కాలనీవాసులు

డీఎస్సీ నోటిఫికేషన్ కోసం 17న ధర్నా

కర్నూలు(సెంట్రల్): డీఎస్సీ నోటిఫికేషన్, నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరుతూ మార్చి 17న కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పిన కూటమి నాయకులు తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. సీఎం చంద్రబాబునాయుడు మొదటి సంతకం చేసినా ఇంతవరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కాకపోవడం అన్యాయమన్నారు. మరో వైపు నిరుద్యోగ భృతికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. నాయకులు నాగరాజు, బీసన్న పాల్గొన్నారు.

వైభవంగా లంకోత్సవం

మద్దికెర : పెరవలి శ్రీరంగనాథస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం లంకోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారి ఉత్సవమూర్తులను అందంగా ముస్తాబు చేసి హనుమంతుడిపై కొలువుంచి గ్రామ పుర వీధుల్లో జనవాహిని మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా తెప్పించిన బాణా సంచా కాల్చారు. లంకోత్సవం రోజున హనుమంతుడికి స్వామి వారు రాముడి రూపంలో కన్పించారని అందువల్ల బ్రహ్మోత్సవాల్లో భక్తులు శ్రీవారిని దర్శించుకుంటే బుద్ధి, బలం, ధైర్యం పొందుతారని ప్రతీతి. ఈఓ వీరయ్య, అర్చకులుతో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



హనుమంతుడిపై కొలువుదీరిన శ్రీరంగనాథుడు

శ్రీచైతన్య మహాప్రభు ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో కర్నూలు భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో శుక్రవారం శ్రీ చైతన్య మహాప్రభు 539వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే గౌర పూర్ణిమ వేడుకలను పురస్కరించుకొని తెల్లవారుజామున 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హరినామ జపం, గౌర హారతి, మహా శంఖాభిషేకం, 108 రాజ భోగ నివేదన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు గౌర లీలపై సందేశమిచ్చారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.